
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

1



విజయనగరం

జిల్లా వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024



ఇది మోసం కాదా?



గత ఎన్నికల సమయంలో జగన్‌తో పాటు వైసీపీ నాయకులు ఊరూరా తిరిగి.. ఇంటింటికీ వెళ్లి మూతపడిన జూట్ పరిశ్రమలను తెరిపిస్తాం.. కొత్త వెలుగులు తెస్తాం.. ఉపాధికి మాది భరోసా.. వెన్నంటే ఉంటాం.. అంటూ ఓటు అడిగారు. నిజమేనని కార్మికులు నమ్మి ఓటేశారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ హామీని విస్మరించింది. ఆ పార్టీ నాయకులు వాటివైపు చూడకపోగా అసలు పరిశ్రమలే లేకుండా నేలమట్టం చేసి ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సహకరించారు. కార్మికుల కళ్లు పొడిచారు. నమ్మించి మోసం చేశారు. వెరసి జూట్ పరిశ్రమలకు పెట్టింది పేరుగా ఉన్న బొబ్బిలిలో ఆ వైభవం కనుమరుగవుతోంది.



ఈ జూట్ మిల్లు ఇప్పుడు లేదు

- పరిశ్రమలు తెరిపిస్తామని.. లేకుండా చేశారు
- జూట్ కార్మికులకు అన్యాయం చేసిన ప్రభుత్వం
- బొబ్బిలిలో మూడు పరిశ్రమల మూత
- ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి..
- ఉపాధి కోల్పోయి జీవనానికీ కార్మికుల ఇబ్బందులు

బొబ్బిలి, ఏప్రిల్ 25

మూతపడ్డ పరిశ్రమలను తెరిపిస్తామని, కార్మికుల ఉపాధిని పునరుద్ధరిస్తామని బీరాలు పలికిన వైసీపీ నాయకులు మిల్లులు తెరవలేదు సరికదా ఏకంగా వాటిని పూర్తిగా నేలమట్టం చేసి రియల్‌ఎస్టేట్లుగా మార్చుకునేందుకు నిస్సిగ్గుగా యాజమాన్యాలకు సంపూర్ణ సహకారం అందించారు. ఫలితంగా బొబ్బిలి ప్రాంతంలో మూడు జూట్‌మిల్లులు(లక్ష్మీ శ్రీనివాస, జ్యోతి, నవ్య మిల్లులు), ఎన్‌సీఎస్ వంచదార పరిశ్రమ ప్రాభవం కోల్పోయాయి. లక్ష్మీ శ్రీనివాస మిల్లులో 2,175 మంది కార్మికులు పనిచేసేవారు. నవ్యలో 250 మంది విధుల్లో ఉండేవారు. ఈ పరిశ్రమల్లో బేకర్స్, డ్రాయింగ్, స్పిన్నింగ్, మగ్గం, చివరి దశలో గోనె సంచుల బేళ్ల తయారీ విభాగాలు ఉంటాయి. అన్నింటా పురుషులు, స్త్రీలు షిఫ్టుల వారీగా పనిచేసేవారు. ఇదంతా గతం. పరిశ్రమల మూతతో కార్మికుల జీవితాలు గాడి తప్పాయి. కొందరు దినదినగండంగా బతుకుతుండగా ఇంకొందరు వేర్వేరు కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన వారూ ఉన్నారు. కాగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. విజయనగరంలో అరుణా ఈస్టుకోస్టుమిల్లులలో ఆరువేలమంది కార్మికులు పనిచేసేవారు. ఈ పరిశ్రమ మూతపడింది. సరోజా మిల్లుదీ అదే పరిస్థితి. కొత్తవలస ఉమా జూట్‌మిల్లులో 1500 మంది పనిచేసేవారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్నది నెలిమర్ల జూట్‌మిల్లు మాత్రమే. కాగా పరిశ్రమలు మూతపడిన ప్రభావం కార్మికుల కుటుంబాలపై తీవ్రంగా పడింది. సుమారు ఐదు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. వారిని పలకరిస్తే వ్యథాభరితమైన గాథలు వినిపిస్తున్నారు. కన్నీటి కష్టాలను ఏకరువు పెడుతున్నారు.



రైలులో వలస వెళ్తున్న జూట్ కార్మికులు (ఫైల్)

ఉపాధి వెతుక్కుంటున్నాం..

బొబ్బిలిలోని జూట్‌మిల్లులు మూసివేయడంతో మేమంతా ఉపాధిని కోల్పోయాం. జూట్‌మిల్లులో పనిచేసే అనుభవంతో నెల్లిమర్ల, ఏలూరులో ఉన్న జూట్‌మిల్లుల్లో పనిదొరుకుతుందన్న ఆశతో పయనమయ్యాం. జూట్ మిల్లులో పని దొరికేవరకు ప్రత్యామ్నాయంగా ఏదో కాయకష్టం చేసుకొని బతుకుతాం. పిల్లాపాపలను పోషించేందుకు శ్రమించక తప్పదు కదా.

-కార్మికులు కిరణ్, మురళి, గోపి, సతీష్, శ్రీరామ్మూర్తి

ఈ పాపం పాలకులదే..

వందలమంది జూట్ కార్మికులకు చెందిన పీఎఫ్ రూ.1.63 కోట్లను యాజమాన్యం చెల్లించాలి. వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే కలిసి మధ్యవర్తిత్వం చేసి జూట్ కార్మికులను నిలువునా ముంచారు. తీరని అన్యాయం చేశారు. పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు వలసబాట పడుతున్నారు. ఈ పాపం ముమ్మాటికి పాలకులదే. గతంలో ఉపాధి కల్పించాలని అడిగిన పాపానికి మహిళలని చూడకుండా పోలీసుల చేత ఉక్కుపాదం మోపి జైళ్లలో కుక్కారు. జూట్ పరిశ్రమల ఉనికి పూర్తిగా కనుమరుగైంది. చెరకు రైతుల పరిస్థితీ దయనీయంగా ఉంది.

-పి.శంకరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, బొబ్బిలి

- బొబ్బిలి పట్టణంలోని తారకరామాకాలనీకి చెందిన 53 ఏళ్ల పిరిడి రాంబాబు జీవితం దయనీయంగా మారింది. 14 సంవత్సరాలపాటు స్థానిక జూట్‌మిల్లులో డ్రాయింగ్ డిపార్టుమెంట్‌లో పనిచేశాడు. ఏడేళ్ల కిందట జూట్‌మిల్లును మూసేయడంతో సాఫీగా సాగే ఆయన జీవితంలో పెద్ద పిడుగుపడ్డట్టయింది. కష్టంగా కుటుంబాన్ని నడుపుతున్న క్రమంలో రెండేళ్ల కిందట పక్షవాతం సోకింది. వైద్యం చేసుకునే స్తోమత లేక మందులు కొనుక్కోలేక దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. అద్దె ఇంట్లో ఉంటూ భార్య తెచ్చే అరకొర జీతంతో కాలం నెట్టుకొస్తున్నాడు. జూట్ యాజమాన్యం 18 నెలలకు సంబంధించిన పీఎఫ్ బకాయిలను చెల్లించని కారణంగా రాంబాబుకు నెలవారీ రావాల్సిన రూ.1500 పెన్షన్ కూడా రావడం లేదు.



పక్షవాతంతో బాధపడుతున్న కార్మికుడు రాంబాబు

- పూలమ్మినచోటనే రాళ్ల మోత అన్నట్లుగా జూట్‌మిల్లులో హెడ్ ఫిట్టర్‌గా పనిచేసిన అప్పారావు అనే కార్మికుడు రైల్వేస్టేషన్‌లో సమోసాలు అమ్ముకుంటున్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు కార్మికులంతా తలో వృత్తిని ఎంపిక చేసుకొని బతుకుబండి ఈడుస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా, హోటళ్లలో సర్వర్లు, క్లీనర్లుగా, చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాల కొనుగోలు, పండ్లు, కూరగాయల విక్రయం తదితర పనులు చేసుకుంటున్నారు. గ్రోత్‌సెంటరులో కొత్త పరిశ్రమల ఉనికి కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఉన్న కొద్దిపాటి ఫ్యాక్టరీల్లో కొన్నింటిని రేపోమాపో మూసేందుకు సిద్ధమవుతున్నారు. విద్యుత్ చార్జీల భారం అధికం కావడం, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో పారిశ్రామిక రంగం దాదాపుగా కునారిల్లిపోతోంది. జూట్ పరిశ్రమలో పనిచేసిన అనుభవం దృష్ట్యా కొందరు నెలిమర్ల, ఏలూరు దరి కొత్తూరు, గుంటూరు ప్రాంతాలకు వలసవెళ్లారు.



రైల్వేస్టేషన్‌లో సమోసాలు అమ్ముతున్న కార్మికుడు అప్పారావు

చంద్రబాబు మాట.. మారిన ఓటరు బాట

- చర్చనీయాంశంగా టీడీపీ అధినేత ప్రసంగం
- గిరిజన విశ్వవిద్యాలయం తరలింపు, ఎస్.కోటను జిల్లాలోనే ఉంచేయడంపై చర్చ



శృంగవరపుకోట, ఏప్రిల్ 25: 'ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో నిర్మించాల్సిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని వేరే చోటకు వైసీపీ ప్రభుత్వం తరలించింది. దీన్ని స్థానిక శాసన సభ్యుడు అడ్డుకోలేదు. పార్లమెంటు స్థానాల వారీగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం చెప్పింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో వున్న శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలోనే ఉంచేశారు. విశాఖ జిల్లాలో కలపాలని ఇక్కడి ప్రజలు గట్టిగా అడిగినా పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే నోరెత్తలేదు. ఈ ప్రాంత ప్రజలకు జిల్లా విజయనగరమే అయినా వాణిజ్య, వ్యాపార అవసరాలకు విశాఖ జిల్లాపై ఆధారపడతారు. టీడీపీ అధికారంలోకి రాగానే విశాఖ జిల్లాలో కలిపేస్తాం. అభివృద్ధి చెందిన జిల్లాను తలదన్నేలా శృంగవరపుకోటను అభివృద్ధి చేస్తాం. వైసీపీ మంత్రి బొత్స సత్యనారాయణ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్.కోటను జిల్లాలో వుంచి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారు.'

- ఎస్.కోట ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు మాటలివి

చంద్రబాబు వ్యాఖ్యలు శృంగవరపుకోట నియోజకవర్గ ఓటర్లను ఆలోచనలో పడేశాయి. ఏ ఇద్దరు ఓ చోట కలిసినా చంద్రబాబు ప్రసంగాన్ని ప్రస్తావిస్తున్నారు. గిరిజన విశ్వ విద్యాలయం తరలింపు, ఎస్.కోటను విశాఖ జిల్లాలో కలపకపోవడం ఈప్రాంత ప్రజలకు నష్టమేనన్న భావన ప్రతి ఒక్కరి నుంచి వ్యక్తమవుతోంది. రాష్ట్ర విభజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విభజిత ఆంధ్రప్రదేశ్‌కు గిరిజన విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసింది. దీన్ని అప్పటి ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు జిల్లాకు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అనువైన స్థలం సేకరించాలని అప్పటి కలెక్టర్, జిల్లాకు చెందిన శాసన సభ్యులకు సూచించారు. ఈమేరకు కొత్తవలస మండలం రెల్లి గ్రామ పరిధిలో ఖాళీగా వున్న ప్రభుత్వ భూమిని అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చూపించారు. ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల విశ్వవిద్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కొత్తవలస మండలం రెల్లి స్థలంపైనే మొగ్గు చూపారు. స్థల సేకరణ బాధ్యతను కూడా రాష్ట్ర ప్రభుత్వం లలిత కుమారికే అప్పగించింది. గిరిజన రైతుల సహకారంతో ఆమె సుమారు 500 ఎకరాలకు పైబడి స్థలాన్ని అందించారు. భూమి పూజ చేసిన ప్రభుత్వం ప్రహరీ కూడా నిర్మించింది. భవన నిర్మాణాలకు పూనుకున్న సమయంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టాక మొత్తం తారుమారైంది. టీడీపీకు పేరొస్తుందన్న భావనతో ఈ ప్రభుత్వం దత్తిరాజేరు, మెంటాడ మండలా సరిహద్దులకు తరలించారు. ఈ ఐదేళ్లలో భూసేకరణతోనే సరిపెట్టారు.

ఇదిలా ఉండగా జిల్లాల పునర్విభజనలో శృంగవరపుకోటను విశాఖ జిల్లాలో కలిపేస్తారని అంతా ఆశించారు. పార్లమెంటు స్థానాలను బట్టి జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రకటించడం, ఈ నియోజకవర్గం విశాఖ పార్లమెంట్ పరిధిలో వుండడంతో విశాఖ జిల్లాలో చేరడం ఖాయమనుకున్నారు. కానీ దీన్ని జిల్లాలోనే ఉంచేశారు. స్థానికులు విశాఖ జిల్లాలో కలిపేయాలని డిమాండ్ చేసినా వినిపించుకోలేదు.

- సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పుడు ఈ రెండు అంశాలు అధికార వైసీపీకి ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా అనుభవం వున్న టీడీపీ అధినేత నారాచంద్రబాబు ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలు లేవనెత్తడంతో స్థానికంగా చర్చకు దారితీసింది. వైసీపీతో ఈ ప్రాంతానికి జరిగిన నష్టాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

అసెంబ్లీకి 184.. పార్లమెంట్‌కు 30

దాఖలైన నామినేషన్లు.. నేడు పరిశీలన

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సంగ్రామంలో కీలక ఘట్టంగా భావించే నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 184 నామినేషన్లను 105 మంది దాఖలు చేశారు. విజయనగరం ఎంపీ స్థానానికి 18మంది అభ్యర్థులు 30 సెట్ల నామినేషన్ పత్రాలు ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. వాటిని శుక్రవారం పరిశీలిస్తారు. 29న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. గుర్తులు కూడా 29నే ప్రకటిస్తారు. మే 13న కీలకమైన ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత వాహన తనిఖీలు తదితర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.4.43 కోట్లు విలువ చేసే వివిధ వస్తువులు పట్టుబడ్డాయి. ఇందులో రూ.1.04 కోట్ల నగదు, 14372 లీటర్ల మద్యం, రూ.29.75 లక్షల విలువైన డ్రగ్స్, రూ.1.85 కోట్ల విలువైన వివిధ ఆభరణాలు, రూ.75.13 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వాటిపై గ్రీవెన్స్‌లు స్వీకరించేందుకు కమిటీని ఏర్పాటు చేశామని, అర్జీలను పరిశీలించి ఎన్నికల ప్రలోభాలకు సంబంధించినవైతే కేసులు నమోదు చేస్తున్నామని, లేని పక్షంలో పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం సంబంధిత యజమానులకు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీనిధి సత్తా

విజయనగరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని పూల్‌బాగ్ కాలనీలో నివాసం ఉంటున్న ధనుకొండ శ్రీనిధి మెయిన్స్‌లో 261(ఓబీసీ-35)వ ర్యాంక్ సాధించింది. ఈమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సుశీల ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. సోదరి దీప్తి ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుతోంది. మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 261 ర్యాంక్ సాధించిన శ్రీనిధి 10వ తరగతిలో 590 మార్కులు సాధించారు. ఇంటర్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ కావటం వల్ల ఇంకా ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. జెఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంక్ వచ్చినప్పటికీ జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించాలన్నదే తన ముందున్న లక్ష్యమని శ్రీనిధి తెలిపారు.



శ్రీనిధికి స్వీటు తినిపిస్తున్న అక్క

ఎన్నికల పరిశీలకుల ఆరా

- ఏర్పాట్లు.. ఫిర్యాదులు..
- పరిష్కారాలపై స్వయంగా తనిఖీ

కలెక్టరేట్/ నెల్లిమర్ల, ఏప్రిల్ 25: చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ గురువారం కంట్రోల్ రూం, మీడియా కేంద్రాన్ని సందర్శించారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన వాహనాల జీపీఎస్, చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల లైవ్‌తీరు, మీడియా మానటరింగ్, ఎంసీసీ, సి విజిల్, ఫిర్యాదుల విభాగాలను తనిఖీ చేశారు. ఎంసీసీ ద్వారా జారీ చేస్తున్న అనుమతులపై ఆరా తీశారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలను అభ్యర్థుల ఖాతాల్లో వేయాలని సూచించారు.

- నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజక వర్గాల పరిశీలకుడుగా ఐఏఎస్ అధికారి హనిష్ చాబ్రను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం విజయనగరం చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతిరోజూ 10.30 నుంచి 11.30 వరకు ప్రజలను కలిసేందుకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల కోసం 9550224904 నంబరును కేటాయించినట్లు తెలిపారు. కాగా పరిశీలకుడు హనిష్ గురువారం నెల్లిమర్లలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.



ఆర్వో నూకరాజుతో మాట్లాడుతున్న చాబ్రా

నిప్పుల కొలిమి

- జిల్లా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 25 : జిల్లాలో ఎండలు భీకరంగా ఉన్నాయి. బయటకు వెళ్లిన వారు చెమటలు కక్కుతూ విలవిల్లాడుతున్నారు. మరోవైపు వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకూ అనూహ్యంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తాజాగా గురువారం రాజాం, కొత్తవలసలో 45 డిగ్రీలు నమోదైంది. జామి, వేపాడ మండలాల్లో 44.1, రేగిడి, సంతకవిటి, గజపతినగరం, గుర్ల, ఎస్.కోట, రామభద్రపురం మండలాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల ధాటికి చిరువ్యాపారులు, కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కపూటతోనే పనులు ముగించుకుంటున్నారు. అత్యవసరం అయితే తప్పా ప్రజలు బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



విజయనగరం: ఎండ వేడికి ఆటోలు కూడా రాక ఒంటరిగా నడుస్తున్న మహిళ

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే...



(కొమరాడ)

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎం లో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకంటే ఎక్కువమంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయినా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలు సీజ్ చేసి రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

మీకు తెలుసా.?

(రాజాం రూరల్)



రాజ్యాంగంలోని 84 (ఎ) ప్రకారం భారతపౌరుడు కాని వ్యక్తి పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థిగా పోటీచేసే వీలులేదు. రాజ్యాంగంలోని 173 (ఎ) ప్రకారం శాసనసభకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

- ప్రజా పాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 4 (బి) ప్రకారం ఏ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తి పోటీకి అనర్హుడు.
- ప్రజాపాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 4 (సి), 4 (సిసి), 4 (సిసిసి) ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీచేసే వీలుంది. అయితే ఈ సెక్షన్ల ప్రకారం అసోం, లక్షదీవులు, సిక్కిం రాష్ట్రాలలో పోటీ చేసేందుకు వీలుకాదు.
- జైలులో ఉన్న వ్యక్తి గానీ.. ఒక జైలు నుంచి మరొక జైలుకు తరలుతున్న వ్యక్తి గానీ.. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి గానీ ఓటు వేయడానికి వీలులేదు.

అప్పట్లో కక్షలు ఉండేవి కావు

పెద్దల మాట

సాలూరు రూరల్: ప్రస్తుత ఎన్నికల్లో కుతంత్రం ఎక్కువైంది. నాడు ఎన్నికలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీ చేసిన వారి మధ్య కక్షలు ఉండేవి కాదు. 1972లో తొలి ఓటు వేశాను. అప్పట్లో ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి... పోటీచేసిన వారు టిఫిన్లు ఏర్పాటు చేసే వారు. అది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసే వారు. ఏ రిక్షాలో వెళ్లినా... మరో పోటీదారులు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగే వారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్లు మనోళ్లు, వారు వాళ్లోళ్లు అని గిరి గీసుకుంటున్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాడు ఎన్నికల్లో ఫలితాలు కోసం బ్యాలెట్లు లెక్కింపు పూర్తయ్యేసరికి దాదాపు రెండు రోజులు ఎదురు చూసేవాళ్లం. ఈవీఎంలు రావడంతో ఫలితాలు తొందరగానే తెలుస్తున్నాయి. ఎన్నికలను యుద్ధంగా వర్ణించడం తగదు. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధి కోసం విజేత, పరాజితులు సహాయ సహకారాలు అందించుకొని అందరినీ సమదృష్టితో చూడాలి.

- లావేటి సన్యాసిరావు (85), సాలూరు అర్బన్‌బ్యాంక్ మాజీ అధ్యక్షుడు



పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా..

కొమరాడ: ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. కాబట్టి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందే తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటారు. ఇందు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎవరు అర్హులంటే

ఎన్నికల విధుల్లో ఉండే అధికారు లు, సిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. ప్రిసైడిం గ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికా రులు, ఏపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్స్), ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, అకౌంటింగ్, సెక్టోరల్ అధికారులు, బీఎల్‌వోలు, పోలీసు, అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులు. వీరికి ఆయా విభాగాల హెడ్‌ల ద్వారా ఫారం-12 దరఖాస్తులు ఇస్తారు. దీనిని పూర్తి చేసి సంబంధిత ఏఆర్‌వోకు పంపించాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆ ఉద్యోగికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక ప్రాంతంలో ఓటు ఉండి వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వారికి సొంత ఊరిలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడకకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉంది.

ఫెసిలిటేషన్ సెంటర్లలో వినియోగం


గతంలో ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ పేపర్‌ను ఇంటికి పంపేవారు. అక్కడ ఓటు పూర్తి చేసి కవర్‌లో పెట్టి సంబంధిత అధికారికి ఇచ్చేవారు. కొన్ని చోట్ల ఇది దుర్వినియోగం అవుతుం డటంతో కొత్త నిబంధన 18ఎ తెచ్చారు. దీని ప్రకారం ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే వారికి బ్యాలెట్ ఇస్తారు. దీనిని ఇంటికి తీసుకువెళ్లేందుకు అనుమతించరు. ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. ఆ తరువాత ఆ బ్యాలెట్ పేపర్‌ను, ప్రమాణ పత్రాన్ని జత చేసి కవర్‌లో పెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం మే 4, 5, 6 తేదీలలో జరగనుంది. ఏ తేదీన, ఏ విభాగం అధి కారులు ఓటు వేయాలో ఉన్నతాధికారులు తెలియజేస్తారు. ఆ సమయంలో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ పోస్టల్ బ్యాలెట్‌ను ఈవీఎంలతో పాటు లెక్కిస్తారు.



ఓటు.. నడిపిస్తున్న నోటు!

- ఎన్నికల్లో డబ్బే కీలకం
- సమయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

(రాజాం రూరల్)



'అన్నిసార్లూ ఓటు రూ.500కే దొరకదు. ఒక్కోసారి పరిస్థితులను బట్టి ఓటుకు రూ.1000 ఇవ్వాలి. అవసరమైతే రూ.5000 కూడా ఇవ్వాలి. అధికారం కావాలంటే ఎన్ని వందల కోట్లయినా ఖర్చు పెట్టాలి..' ఇవీ ఓ సినిమాలో కథానాయకుడు అన్న మాటలు. సినిమా డైలాగులను పక్కన పెడితే.. అంతగా ఖర్చు చేయకపోయినా భారీగా డబ్బు లేనిదే ఎన్నికలు లేవన్నది వాస్తవం... డబ్బుకు లోకం దాసోహం అన్నారు. ఎన్నికల వేళ కోట్లు ఖర్చు చేసేందుకు నేతలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సంఘం జిల్లాకు ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. వీరిలో ఒకరు పార్లమెంట్‌కు, ఇద్దరు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఖర్చులను లెక్కిస్తున్నారు. వీరే కాకుండా జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలతో అధికార యంత్రాంగ నిఘాతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

ఇస్తున్న నేపథ్యంలో ఈసారి డబ్బు ఏరులై పారడం కచ్చితమని తెలుస్తోంది. మరి అభ్యర్థుల ఖర్చు ఎలా ఉండాలో.. ఎంత ఉంటోందో ఓసారి చూద్దామా?

జిల్లాలో పరిస్థితి



జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో అధికార వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. కాంగ్రెస్ తదితర పార్టీలు సైతం తమదైన రీతిన ప్రచారం ప్రారంభించాయి. అధికారం దక్కించుకోవాలని తెలుగుదేశం కూటమి అభ్యర్థులు... రెండోసారి విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వైసీపీ అభ్యర్థులు ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగాయి. ఈ ఎన్నికలో ఎంత ఖర్చు చేయగలరో తెలుసుకుని కొన్ని పార్టీలు టికెట్లు

అధికారికంగా...

ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీగా బరిలో దిగిన అభ్యర్థి రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని ఎన్నికల సంఘం నిబంధన. ఈ ఖర్చులు రికార్డులకే పరిమితం. వాస్తవంగా జరుగుతున్న ఖర్చు ఎంతనేది జగమెరిగిన సత్యం. పాదయాత్రలు, బహిరంగ సభలు, రోజువారీ కార్యకర్తలు, నాయకుల ఖర్చులు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రచారం ఖర్చులు... వాహనాల పెట్రోల్... ఇలా అన్నీ కలిపి అంచనాలు దాటుతాయి. ఇక నామినేషన్ వేసిన ఒక్క రోజు చేసిన ఖర్చు అతని స్థాయిని తెలియజేస్తుంది. ఇదే గెలుపోటములపై ప్రజల్లో ఓ అంచనా వేసేందుకు కీలకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

జిల్లాలో రూ.500 కోట్లు పైమాటే..

ఏడు నియోజకవర్గాలలో రెండు ప్రధాన పార్టీల నుంచి 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వీరే సుమారు రూ.300 కోట్లు వరకు ఖర్చు చేస్తారన్నది ఓ అంచనా. ఇతర పార్టీల అభ్యర్థులను పరిశీలిస్తే మరో రూ.పదికోట్లు ఖర్చు చేసే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి రెండు ప్రధాన పార్టీల ఖర్చు ఇప్పటికే సుమారు రూ.100 కోట్లు దాటిందనడం సందేహం లేదు. అధికార పార్టీ అభ్యర్థులు నియోజకవర్గంలో కనీసం రూ.50 కోట్లు ... ఆపై ఖర్చు చేసేందుకు కూడా వెనుకంజ వేయడం లేదన్నది వాస్తవం.

ఎంపీ నియోజకవర్గాలలో..

విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని ఆరు నియోజనవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం కూడా కలిసి ఉంది. ఎంపీ అభ్యర్థి తన పరిధిలో గల అసెంబ్లీ పరిధిలోని ఖర్చులను కూడా కొంతమేర భరించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే...



విజయనగరం: కొందరు అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టా రాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమా వళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం-1951 సెక్షన్ 125, ఐసీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171 ఈ, హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

కత్తులు దూసేవారిపై నిఘా

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు గస్తీ
- యువత ఇరుక్కుంటే.. ఇబ్బందులు తప్పవు



గ్రామాల్లో పోలీసుల కవాతు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు కల్పించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు చేసిన వారిపై ఎన్నికల అధికారులు, పోలీసులు డేగ కన్నువేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాట్లు, అవగాహన కార్యక్రమాలను పోలీసు యంత్రాంగం చేపట్టింది. జిల్లాలో సుమారు 267 వరకు సమస్యాత్మక, అతి సమసాత్మక ప్రాంతాలు ఉన్నాయి.

శాంతియుతంగా ఎన్నికలు జరగాలి: కలెక్టర్



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం జిల్లా అంటేనే శాంతికాముకులుగా పేరుగాంచింది. ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన నేల. ఇక్కడి ప్రజలు గొడవలు, అల్లర్లకు దూరంగా ఉంటారని చెబుతుంటారు. వచ్చే ఎన్నికలలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలందరూ సహకరించి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి. ముఖ్యంగా యువత ప్రలోభాలకు లొంగకుండా... గొడవల్లో కలుగజేసుకోకుండా స్వేచ్ఛాయుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి. జిల్లాకు ఉన్న మంచి పేరును కొనసాగిద్దాం.



తప్పెటగుళ్ల కళాకారులు

ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్లు ఉండాల్సిందే..

సందడి

విజయనగరం: ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో తప్పెటగుళ్ల సందడి కనిపిస్తోంది. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తప్పెటగుళ్లతో కళాకారులు ఆడిపాడుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో ముందుగా నిర్వహించే నామినేషన్ల పర్వంలోనే ఎక్కువ సందడి ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఎంత బాగా జనసమీకరణ చేస్తే, అంతకంటే జోరుగా ప్రచారం సాగుతుందని రాజకీయ పార్టీల విశ్వాసం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ముఖ్య నేత వచ్చినా స్వాగతం పలికేందుకు తప్పెటగుళ్ల కళాకారులు ముందుంటారు. శ్రీకాకుళం జిల్లా ఎస్ఎంపురం, పెద్దపాడు, ముద్దాడ, అల్లినగరం, బుడుమూరు, బావాజీపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో సుమారు 1200 మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కళాకారులు ప్రచార కార్యక్రమాల్లో సందడి చేశారు.

పార్టీలకు కొమ్ము కాస్తే ఉద్యోగం ఊడినట్లే..



(కొమరాడ)

ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీకీ బహిరంగంగా మద్దతు తెలపకూడదు. అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఉద్యోగులకు వివిధ రాజకీయ పార్టీలు, నాయకులపై అభిమానం ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఉద్యోగులు ఎవ్వరైనా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వకూడదు. ఉద్యోగులు ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన ప్రచారం చేస్తే భారీ మూల్యం చెల్లించకతప్పదు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారం చేసినట్లు ఆధారాలతో రుజువైతే ఉద్యోగానికి ఎసరు వస్తుంది. ప్రభుత్వం నుంచి ఏ రకంగానైనా, నెల నెలా డబ్బులు పొందేవారు ఎన్నికల ప్రచారం చేయడానికి అనర్హులు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాలా మంది వలంటీర్లు, ఆర్పీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు భాగస్వాములు కావడం వివాదానికి దారి తీస్తుంది. మోటార్ బైక్‌ల ర్యాలీలు, సాధారణ ర్యాలీలు, సభలలో పాల్గొనకూడదు. ఒక పార్టీకి చెందిన వారు మరో పార్టీ వారి రోజు వారీ ప్రచారాలు, ఇతర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎప్పుడు ఏం చేస్తున్నారో, ఏ సమయంలో ఏం చేస్తున్నారో, రికార్డింగ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లలో చిత్రీకరించి సంబంధిత క్లిప్‌లను నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపుతున్నారు. ఆధారాలు ఉంటే ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.

- వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. పార్టీలకు సంబంధం లేకుండా సమావేశాలు నిర్వహించాలి. లేదంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద వస్తుంది. ఆధారాలతో ఎవరైనా జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.
- ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. పాఠశాల విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొంటే, వారితో ఫొటోలు దిగడం, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాల ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, ఫోన్‌లు చేయడం పరిపాటిగా మారింది. సోషల్ మీడియా ఆధారాలతో కూడా ఉద్యోగులపై అధికారులు వేటు వేసే అవకాశం ఉంది. అందుకే ఉద్యోగులు ప్రచారానికి దూరంగా ఉండాలి. ఉద్యోగులే కాకుండా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందే వారంతా పార్టీల ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది.

పీపుల్స్ మేనిఫెస్టో

అభివృద్ధి కావాలి



సాలూరు రూరల్: ప్రజలకు భరోసా కావాలి. ఎన్నికల్లో విజయం కోసం ఏవో హామీలివ్వడం కాదు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలి. నాలుగు కాసులివ్వడం కాదు. సంపాదించడం నేర్పితే బాగుంటుంది. ఉపాధిని అందరికీ అందించాలి. ప్రలోభాలకు లొంగ వద్దు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేస్తాను.

- ఏరుబోతు అప్పారావు, మామిడిపల్లి

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 26 ఏప్రిల్ 2024




పార్వతీపురం కలెక్టరేట్

పార్వతీపురం నియోజకవర్గానికి ఈసారి ఓ ప్రత్యేకత ఉంది. ఒకప్పుడు విజయనగరం జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లాగా అవతరించింది. కొత్త జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలు కావడంతో అందరి చూపూ ఈ నియోజవర్గంపైనే ఉంది. ఇక్కడి ఓటరు తీర్పు ఎలా ఉంటుందో...ఎవరిని ఎన్నుకుంటారోనని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

పార్వతీపురం నియోజకవర్గ ముఖచిత్రం

పురం.. ఎవరికో వరం



పార్వతీపురం నియోజకవర్గం మ్యాప్

- కొత్త జిల్లాలో తొలి ఎన్నికలు
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఈసారి మొగ్గు

(పార్వతీపురం, ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా ఎన్నికలు వస్తున్నాయి. పార్వతీపురం నియోజకవర్గం 2019 సార్వత్రిక ఎన్నికల వరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉండేది. జిల్లాల విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. 2009లో పునర్విభజనకు ముందు మక్కువ, గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం మండలాలతో పాటు పార్వతీపురం పట్టణం ఈ నియోజకవర్గంలో ఉండేవి. అప్పటి వరకు పార్వతీపురం నియోజకవర్గం జనరల్ కేటగిరిలో ఉండేది. 2009లో పునర్విభజన తరువాత మక్కువ, గరుగుబిల్లి, కొమరాడ మండలాలను తప్పించి కొత్తగా సీతానగరం, బలిజిపేట మండలాలను చేరుస్తూ పార్వతీ పురం పట్టణంతో పాటు పార్వతీపురం మండలాన్ని కలుపుకొని నియోజ కవర్గం ఏర్పడింది. పునర్విభజన అనంతరం ఈ నియోజకవర్గం షెడ్యూల్ కులాలకు కేటాయిం చారు. అప్పటి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు శాసన సభ్యులుగా ఉంటున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి సవరపు జయమణి, 2014లో టీడీపీ తరపున బొబ్బిలి చిరంజీవులు, 2019లో వైసీపీ నుంచి అలజంగి జోగారావు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ప్రజల నాడి చూస్తే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థికే విజయావకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

నియోజకవర్గం లో ఓటర్లు...


పార్వతీపురం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,89,565 మంది. ఇందులో పురుషులు 93,395 మంది, మహిళలు 96,159, థర్డ్ జెండర్ 11 మంది ఉన్నారు.

నియోజకవర్గ ప్రత్యేకత..

పార్వతీపురం నియోజకవర్గంలో కిలోమీటరులోపు రెండు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్‌తో పాటు బెలగాం రైల్వేస్టేషన్ ఉన్నాయి.


ఒకప్పుడు డివిజన్ కేంద్రం...

రెండేళ్ల క్రితం వరకు పార్వతీపురం పట్టణం డివిజన్ కేంద్రంగా ఉండేది. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంగా ఏర్పడింది. కొత్తగా జిల్లా ఆవిర్భవించిన తర్వాత బొబ్బిలి పట్టణంతో పాటు రామభద్రాపురం, తెర్లాం, బొబ్బిలి మండలాలు విజయనగరం జిల్లాలోకి వెళ్లగా... శ్రీకాకుళం జిల్లా నుంచి పాలకొండ నగర పంచాయతీతో పాటు పాలకొండ, సీతంపేట, భామిని మండలాలు కొత్తగా చేరాయి.


పార్వతీపురం పట్టణం

1952లో మొదటి ఎన్నికలు

పార్వతీపురం నియోజకవర్గానికి మొట్టమొదటి ఎన్నికలు 1952లో నిర్వహించారు. మొట్టమొదటి ఎమ్మెల్యేగా వీడీవీరభద్రదేవ్ బహదూర్ జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆయన 1952 నుంచి 1962 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడు.. చీకటి పరశురామనాయుడుపై గెలుపొందారు. 1967లో వెంకటరామినాయుడు కాంగ్రెస్ తరపున ఎన్నికయ్యారు. 1972లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన చీకటి పరశురామనాయుడు.. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడిపై గెలిచారు. 1978లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన చీకటి పరశురామనాయుడు.. కాంగ్రెస్ (ఐ) పార్టీ తరపున పోటీ చేసిన వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడుపై ఎన్నికయ్యారు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దొడ్డి పరశురాముపై ఇంటిపెండెంట్‌గా పోటీ చేసిన మరిచర్ల వెంకటరామినాయుడు గెలుపొందారు. అక్కడి నుంచి నియోజకవర్గంలో దశాబ్దాల పాటు టీడీపీ ప్రభంజనం కొనసాగింది. 1985లో మరిచర్ల వెంకటరామినాయుడు (టీడీపీ)... పరశురాము (కాంగ్రెస్)పై పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 1989లో ఎర్ర కృష్ణమూర్తి తెలుగుదేశం తరపున పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి శివున్నాయుడుపై విజయం సాధించారు. 1994లో కూడా కృష్ణమూర్తి (టీడీపీ).. కాంగ్రెస్ అభ్యర్థి శివున్నాయుడుపై గెలిచారు. 1997లో కృష్ణమూర్తి మృతి చెందడంతో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఉప ఎన్నికల్లో కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణమ్మ పోటీ చేసి గెలుపొందారు. 1999లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ప్రతిమాదేవిపై మరిచర్ల శివున్నాయుడు(కాంగ్రెస్) గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి శత్రుచర్ల విజయరామరాజు.. టీడీపీ అభ్యర్థి ద్వారపురెడ్డి జగదీష్‌పై గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి బొబ్బిలి చిరంజీవులు(టీడీపీ)పై సవరపు జయమణి (కాంగ్రెస్) గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి బొబ్బిలి చిరంజీవులు... వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌పై విజయం సాధించారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసిన బొబ్బిలి చిరంజీవులుపై వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు గెలుపొందారు. ప్రస్తుతం వైసీపీ నుంచి ఆయన మరోసారి పోటీ చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బోనెల విజయచంద్ర బరిలో ఉన్నారు.


ఎర్ర కృష్ణమూర్తి


సవరపు జయమణి


శత్రుచర్ల విజయరామరాజు


అలజంగి జోగారావు


బొబ్బిలి చిరంజీవులు


టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు అభిమానులతో కిటకిటలాడిన పార్వతీపురం

ముగిసిన నామినేషన్ల పర్వం

- కోలాహలంగా విజయచంద్ర..

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజ కవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర గురువారం భారీ ర్యాలీగా వెళ్లి నామినేష న్ వేశారు. ఈ కార్యక్రమానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న సీతారామ మందిరంలో తన సతీమణితో కలసి పూజలు చేశారు. నాయకులు, కార్యకర్తలు మండుటెండను సైతం లెక్క చేయకుండా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి బొబ్బిలి అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న విజయచంద్ర

ఉత్సాహంగా సంధ్యారాణి నామినేషన్

సాలూరు: సాలూరు పట్టణం పసుపు రంగు సంతరించు కుంది. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ శ్రేణులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ కూడలి వరకు రోడ్లు కిక్కిరిసిపో యాయి. కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి స్థానిక రిట ర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మరో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి విష్ణు చరణ్‌కు అందించారు. ఈ సందర్భంగా సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల నుంచి భారీ స్థాయిలో పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆమె ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రచార రథంపై ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. బోసుబొమ్మ కూడలి వద్ద క్రేన్‌తో ఆమెకు గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 23వ వార్డు మాజీ కౌన్సిలర్ ఏగిన నాగరాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.


ర్యాలీలో పాల్గొన్న సంధ్యారాణి


సాలూరు పట్టణంలో కూటమి నాయకులు, కార్యకర్తల ర్యాలీ

పాపం.. పున్నారావు

రాజాం రూరల్, ఏప్రిల్ 25: విజయనగరం జిల్లా రాజాంకు చెందిన సిరిపురపు పున్నారావు చిన్నపాటి తప్పిదం వల్ల నామినేషన్ వేయలేకపోయారు. ఈ ఘటన రాజాంలో గురువారం చోటుచేసుకుంది. నామినేషన్ వేసేందుకు అవసరమైన అన్నిపత్రాలున్నా.. తాజాగా ప్రారంభించిన బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాస్‌పుస్తకం లేకపోవడంతో నామినేషన్ వేయలేని పరిస్థితి పున్నారావుకు ఎదురైంది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్న కొత్తకోటకు చెందిన సిరిపురపు పున్నారావు రాజాం నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసేందుకు నిర్ణయించుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని పత్రాలను సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం నామినేషన్ వేసేందుకు తన మద్దతుదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందజేశారు. పత్రాలు పరిశీలించిన ఆర్‌వో.. తాజాగా ప్రారంభించిన బ్యాంకు పాస్‌పుస్తకం లేకపోవడాన్ని గుర్తించారు. అప్పటికే సమయం మూడు గంటలు కావస్తుండడంతో ఏమీచేయని పరిస్థితుల్లో పున్నారావు వెనుదిరిగారు. పున్నారావు మళ్లీ నామినేషన్ వేయాలంటే మరో అయిదేళ్ల ఆగాల్సిందే.


నిరుత్సాహంగా ఉన్న పున్నారావు

అరుదైన గౌరవం

తొలి మహిళా స్పీకర్ ప్రతిభాభారతి



విజయనగరం: టీడీపీలో గుర్తింపు పొందిన నాయకుల్లో ప్రతిభా భారతి ఒకరు. మంత్రిగా, శాసనసభ తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 1983లో ఎన్టీఆర్ పిలుపు మేరకు ప్రతిభాభారతి టీడీపీలో చేరారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఎచ్చెర్ల ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 1983 తొలి ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో తొలి ఫలితం ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే వచ్చింది. ఆ సమయంలో ప్రతిభాభారతి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. దీన్ని సెంటిమెంట్‌గా భావించిన ఎన్టీఆర్ ఆమెను తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అప్పట్లో కేబినెట్‌లో ఉన్న ఏకైక మహిళా మంత్రి కూడా ప్రతిభా భారతి కావడం మరో విశేషం. ఎన్టీఆర్ కేబినెట్‌లో రెండుసార్లు ఆమెకు చోటుదక్కింది. 1995లో చంద్రబాబు తన కేబినెట్‌లోకి ప్రతిభాభారతిని తీసుకుని విద్యాశాఖను కేటాయించారు. 1999లో ఆమెకు స్పీకర్‌గా చోటుకల్పించారు. దీంతో రాష్ట్రంలోనే తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు.

అధికారులే కీలకం

- వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం
- గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రధాన పాత్ర

(విజయనగరం)

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. గ్రామ స్థాయి నుంచి మొదలుకుని జిల్లాస్థాయి వరకు అధికారులు తమ పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారి(చీఫ్ ఎలక్టోరల్ అధికారి)ని సంప్రదిస్తుంది. ఆ అధికారి పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో పనిచేసే అధికారుల వివరాలు..

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లా ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారే (కలెక్టర్) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలుచేస్తారు.



సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా బూత్‌ల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారం ఆయనకే ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్వో, ఏఈఆర్వో) ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్న వారంతా ఆయన్ను సంప్రదించాలి. ఈఆర్వో, ఏఈఆర్వో పర్యవేక్షణలో సిబ్బంది ఓటర్ల జాబితాను తయారుచేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి(పీవో)

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఈవీ ఎంలు, వీవీ ప్యాట్‌లు బూత్‌లకు తీసుకొచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి తిరిగి వాటిని స్ట్రాంగ్‌రూముకు చేర్చేవరకు పీవోదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్‌కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీవో పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటుచేస్తారు. మండలానికి ఒకరు మాత్రమే ఉంటారు. వీరంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం, వారికి అవస రమైన శిక్షణ ఇవ్వడం, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలు ఆర్వో పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఆర్డీవోకు ఈ బాధ్యతలను అప్పగిస్తారు.

బూత్ లెవల్ అధికారి(బీఎల్వో)

ప్రతి కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫారం-6, తొలగింపునకు ఫారం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడడం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల మార్పునకు బీఎల్వోలు పనిచేస్తుంటారు. వీరిలో వీఆర్ ఏలు, కారోబార్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉంటారు.

పోలింగ్ ఏజెంట్లు

అభ్యర్థులు పోలింగ్ రోజున ప్రతి కేంద్రానికి వెళ్లి నేరుగా పరిశీలించలేరు. అందు వల్ల వారి తరపున ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. పోలింగ్ ఏజెంట్ ఆ కేంద్రంలో ఓటరుగా ఉండాలి. పోటీలో ఎంత మంది బరిలో ఉంటే అంత మంది ఏజెంట్లను నియమించుకోవడానికి అవకాశాలు ఉన్నాయి.

శిథిల భవనంలోనే..

● కూలిపోయేందుకు సిద్ధంగా బీసీ బాలుర వసతి గృహం ● పెచ్చులూడుతున్న శ్లాబుల కిందే విద్యార్థులు

భోగాపురం: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. మంచి భవనాలు నిర్మిస్తున్నాం.. వసతి సౌకర్యం కల్పిస్తున్నాం అని ప్రభుత్వం చెబుతుందే గాని క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంది. భయం లేకుండా కంటినిండా నిద్రపోవడానికి కనీస సౌకర్యంలేక విద్యార్థులు శిథిలమైన భవనంలోనే దినదిన గండంలా కాలం వెల్లబుచ్చుతున్న పరిస్థితులు ఇంకా ఉన్నాయి. భోగాపురంలో మండల కార్యాలయాల సమీపంలో గల బీసీ బాలుర వసతి గృహమే దీనికి ఉదాహరణ.

జాతీయ రహదారి సమీపంలో బీసీ బాలుర వసతి గృహం ఉండేది. అది పూర్తిగా శిథిలమవడంతో కొన్నేళ్ల క్రితం మూసేసి నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలోకి బీసీ బాలుర హాస్టల్‌ను తరలించారు. అయితే ఎస్సీ వసతి గృహం అప్పటికే అనేక పర్యాయాలు మరమ్మతులకు గురైంది. శిథిలమైన ఎస్సీ వసతి గృహంలోనే కొన్నేళ్లుగా బీసీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 54 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ వసతి గృహం పూర్తిగా శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఈ వసతి గృహంలో విద్యార్థులు భోజనం చేసే గది, వంటశాల పూర్తిగా శిథిలమవడంతో వాటిని తెరవకుండా పూర్తిగా మూసేశారు. వసతి గృహంలో 8 గదులు ఉన్నా అన్ని గదులు శ్లాబు పెచ్చులు పడుతూనే ఉన్నాయి. కొద్దిపాటి వర్షం పడినా కనీసం కూర్చోవడానికి స్థలం కూడా ఉండదు. ఎప్పుడు శ్లాబు పెచ్చులు ఊడి మీద పడతాయోనని విద్యార్థులు కంటినిండా నిద్రకూడా పోవడంలేదు. భవనం శిథిలమవడంతో సౌకర్యవంతమైన స్థలం లేక పోవడంతో గత ప్రభుత్వంలో విద్యార్థులకు వచ్చిన మంచాలని మూలన పడేయడంతో తుప్పు పట్టి మూలన పడి ఉన్నాయి. సౌకర్యంతమైన స్థలంలేక విద్యార్థులు అందరూ ఒకే చోట నేలపైనే నిద్రిస్తున్నారు. సరైన భవనం లేకపోవడంతో ఒకరోజు శలవు వచ్చినా విద్యార్థులు ఇంటి ముఖం పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థులు ఉంటున్న గదుల దుస్థితి


బీసీ బాలుర వసతి గృహం

ఉన్నతాధికారులకు తెలిపాం

మాట్లాడుతూ శిథిలమయిన భవనం విషయమై పై అధికారుల దృష్టిలో పెట్టాం. అయితే గ్రామంలో ఎక్కడైనా అద్దె భవనం చూసి అక్కడకు తరలించాలని పైఅధికారులు సూచించారు. అద్దె భవనం కోసం ప్రయత్నిస్తున్నాం. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని గ్రామ పరిధిలో అద్దె భవనం ఉంటే మా దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరుతున్నామని తెలిపారు.

సీ.హెచ్.శరణ్మయి, వసతి గృహ ఇన్‌చార్జి సంక్షేమ అధికారి

చంద్రబాబును కలిసిన రవిశేఖర్

నెల్లిమర్ల: టీడీపీ అధినేత చంద్రబాబును పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ గురువారం ఉదయం విజయనగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన తో జిల్లా, నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై చర్చించారు.

టీడీపీ హయాంలో మహిళలకు సంక్షేమం

దత్తిరాజేరు: టీడీపీ హయాంలో మహిళలకు పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అందేవని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మీసింధు అన్నారు. మరడాం గ్రామంలో గురువారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుర్ల: మండలంలో శుక్రవారం గరివిడి నుంచి నాలుగో సబ్‌స్టేషన్‌కు వెళ్లే హెచ్‌టీ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారి హరి తెలిపారు. నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలోని జమ్ము, జమ్ముపేట, నాగళ్లవలస, తాటిపూడి, సదానంతపురం, గొలగాం, తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

టీడీపీలో చేరిక

భోగాపురం (పూసపాటిరేగ): పూసపాటిరేగ మండలం పతివాడ పంచాయతీ తమ్మయ్యపాలెం, తిప్పలవలస పంచాయతీలకు చెందిన 60 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వీరిని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకర్రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేమలిలో..

గజపతినగరం: వేమలి గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ సుంకరి సావిత్రితో పాటు వార్డు మెంబర్లు బుధవారం రాత్రి టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, క్లస్టర్ ఇన్‌చార్జి గుంప్రోతు గోవింద పాల్గొన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం

చీపురుపల్లి: స్థానిక బాలభవన్‌లో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవో బూసినాయుడు గురువారం ప్రారంభించారు. ఈ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, కీ బోర్డు, తబలా తదితర అంశాల్లో శిక్షణనిస్తామని ఈసందర్భంగా డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు.

జనసేన నూతన కమిటీ ఎన్నిక

లక్కవరపుకోట: జనసేన మండల కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు జనసేన సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ, మండల కమిటీ ఏర్పాటు చేశారు. షేక్ ఫిరోజ్ అధ్యక్షునిగా, రావాడనాయుడును యూత్ ప్రెసిడెంట్‌గా నియమించారు. గుడిన సతీష్, ఇర్ర వెంకటలక్ష్మి, పులిబంటి శ్యామల, గొర్లె శ్రీనివాస్‌ను జనరల్ సెక్రటరీలుగా నియమించారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా టీడీపీ నేతలు కరెడ్ల ఈశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

పోలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష

బొబ్బిలి: ఈనెల 27న జరగనున్న పోలిసెట్ కోసం అవసరమైన ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని కోమటిపల్లి తాండ్రపాపారాయ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో కోఆర్డినేటర్ ఉదయ్‌భాస్కర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎ.సుధీర్‌బాబు పాల్గొని సెట్ నిర్వహణపై చర్చించారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలన్నారు.

కూటమి సభ్యులను గెలిపించాలి

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజెపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాల రాష్ట్ర కాపు జెఏసీ కన్వీనరు జేసుదాస్ పిలుపునిచ్చారు. గత వారం రోజులుగా అన్ని జిల్లాల్లో జెఏసీ తరుపున పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించామన్నారు. జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాష్, విజయనగరం నియోజకవర్గ టీడీపీ నాయకుగు గొల్లకోటి గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిట్రమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: నెలివాడ గ్రామంలోగల బిట్రమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఉపాధి పనుల వద్ద ప్రచారాలు

గజపతినగరం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ నేతల ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. గ్రామాల్లో కంటే ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువుల వద్దనే అధికంగా ప్రచారాలు సాగిస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి 10 గంటల సమయంలో గ్రామాల్లో ఎక్కడ ఉపాధి పనులు జరుగుతున్నాయో అక్కడికే వెళ్లి టీడీపీ, వైసీపీ నేతలు ప్రచారాలు చేస్తున్నారు.

ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి: నాగమాధవి


మాట్లాడుతున్న లోకం మాధవి

నెల్లిమర్ల: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని బొప్పడాం, పినతరిమి, బుచ్చన్నపేట, మధుపాడ, జోగిరాజుపేట, సతివాడ, గుషిణి, అలుగోలు గ్రామాల్లో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఆమె ఆయా గ్రామాల్లో పర్యటించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది: బేబీనాయన


ఆరికతోటలో బేబీనాయన ప్రచారం

రామభద్రపురం: బొబ్బిలి కూటమి అభ్యర్థి బేబీనాయనకు మండలంలోని ఆరిక తోట గ్రామంలో గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించి ప్రచారం చేపట్టారు. అవినీతిలో కూరుకుపోయిన ఈ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పోరాడాలని టీడీపీ బొబ్బిలి కూటమి అభ్యర్థి బేబీనాయన కోరారు. మండలపరిధిలోని నర్సాపురం గ్రామంలో గురువారం సాయంత్రం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లమ్మపేట గ్రామంలో గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మనాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఇవే చివరి ఎన్నికలు


ప్రచారంలో లలితకుమారి, శ్రీనాగి

శృంగవరపుకోట రూరల్: రాష్ట్ర యువత భవిష్యత్‌ను జాబ్ క్యాలెండర్ పేరుతో నాశనంచేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఇవే చివరి ఎన్నికలనీ టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు శ్రీనాగి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని అలుగు బిల్లి, చామాలపల్లి గ్రామాల్లో కూటమి ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారిని గెలిపించాలన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

జామి, ఏప్రిల్ 25: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిర్ల గ్రామానికి చెందిన దండి నాగరాజు(28) మండలంలోని అట్టాడ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్య, భర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండడం, మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెందిన నాగరాజు ఈనెల 23న ఇంటినుంచి బయటకు వెళ్లాడు. అప్పటినుంచి ఇంటికి తిరిగిరాలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం 9గంటల సమయంలో అలమండ నూతన హైవే వంతెన కింద ఒక మృతదేహం ఉందని సమాచారం రావడంతో పోలీసులు, నాగరాజు కుటుంబ సభ్యులు వెళ్లారు. మృతదేహం నాగరాజుదిగా గుర్తించారు. పక్కనే సగం తాగి వదిలేసిన పురుగులమందు సీసా ఉంది. భార్య, భర్తల గొడవల వల్లే తన కుమారుడు చనిపోయాడని మృతుడి తండ్రి సన్యాసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని జామి ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. నాగరాజు మృతితో కిర్లలోని అతని కుటుంబ సభ్యులు, మిత్రులు విషాదంలో మునిగిపోయారు.

20న పైడిమాంబ దేవర ఉత్సవం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 25: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ దేవర ఉత్సవం మే నెల 20న జరుగుతుందని ఆలయ ఈవో ప్రసాద్‌రావు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా వైశాఖమాసంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అక్టోబరు నెలలో జరిగే పైడిమాంబ సిరిమానోత్సవానికి ఈ దేవర ఉత్సవం నాందివంటిదన్నారు. ఆ రోజు నుంచి చదురుగుడిలో ప్రత్యేక పూజలు జరగనున్నాయన్నారు.

అవినీతిపరులకు అవకాశం ఇవ్వకండి

● అశోక్ గజపతిరాజు


మాట్లాడుతున్న అశోక్

విజయనగరం రూరల్: మే నెల 13న జరగనున్న ఎన్నికలు కీలకమైనవని, ఆ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి పరులకు అవకాశం ఇవ్వకండని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని 1, 13, 14 డివిజన్ల పరిధిలో, అదే విధంగా అంబటి సత్తర్వు జంక్షన్‌లో 12, 16, 15 డివిజన్ల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. రానున్న ఎన్నికల్లో ఆలోచించి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● నగరంలోని 26వ డివిజన్ పరిధిలోని వైసీపీకి చెందిన యర్రంశెట్టి రమణ, వి.సూర్యనారాయణ, వై.శ్రీనివాస్, పి.రాము, అయ్యప్పతో పాటు 25 కుటుంబాలు గురువారం వైసీపీకి రాజీనామా చేసి అదితి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, గాదు అప్పారావు, కర్రోతు నర్సింగరావు, అల్తి బంగారుబాబు, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. ● చంద్రబాబు నాయుడు ఈ నెల 24న విజయనగరం కలెక్టరేట్ జంక్షన్‌లో నిర్వహించిన 'ప్రజాగళం' కార్యక్రమం విజయవంతం అయ్యిందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.

సీఎం జగన్ పాలనలో రోడ్లు అస్తవ్యస్తం : కోండ్రు


రాజాంలో ప్రచారం చేస్తున్న కోండ్రు

రాజాం: సీఎం జగన్ పాలనలో రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు గురు వారం సంతకవిటి మండలం చిత్తారపురం పంచాయితీ గారన్నాయుడుపేట. గుజకజన్నపేట, బూరాడపేట, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం చేపట్టారు. కొళ్ల అప్పలనాయుడు, గట్టి భాను, వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు. ● రేగిడి మండలం ఆమదాలవలస గ్రామానికి చెందిన కిమిడి నాగేంద్రనాయుడు జిల్లా వ్యవసాయ మండలి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేసి గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాజాంలోని టీడీపీ కార్యాలయంలో కోండ్రు ఆధ్వర్యంలో చేరారు. రేగిడి: మండలంలో సరసనాపల్లి, జోడుబందల, లచ్చరాయపురం గ్రామాల్లో గు రువారం టీడీపీ మండల స్థాయిక్యాడర్ సూపర్‌సిక్స్ పథకాలు, జగన్ అరాచకపాలనపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ నేతలు గురవాన రమేష్, నడిపేన సన్నిబాబు, పైల వినయ్‌కుమార్, గురవాన ధనంజయ్, విక్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

జామి: మండల కేంద్రమైన శ్రీ స్వర్ణకర్షరాజరాజేశ్వరీత్రిపురాంతక స్వామి ఆలయంలో గురువారం వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండి ఈశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు విశ్వనాధశర్మ మట్లాడుతూ దాతల సహకారంతో ఈ విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు.

పెళ్లి ట్రాక్టర్ బోల్తా

● మహిళ మృతి.. పలువురికి గాయాలు

వంగర, ఏప్రిల్ 25: పెళ్లి ట్రాక్టర్ బోల్తాపడడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిజిపేట మండలం పెదపెంకికి చెందిన యాకుల సత్యం కుమార్తెకు వంగర మండలం పటువర్ధనంలో చిన్నరాములు కుమారుడితో బుధవారం తెల్లవారు జామున వివాహమైంది. పెళ్లి అనంతరం గురువారం యానాలు నిర్వహించారు. దీంతో పెళ్లి కోసం బుధవారం పెదపెంకి నుంచి వచ్చిన బంధువులంతా అక్కడే ఉండి, గురువారం మధ్యాహ్నం నిర్వహించిన యనాలు కార్యక్రమంలో భోజనాలు చేసి మధ్యాహ్నం ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఊరు పొలిమేర దాటిన కొంత సేపటికే బాగెమ్మపెట - పటువర్ధనం మార్గమధ్యలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. గుర్తించిన స్థానికులు, గ్రామస్థులు ట్రాక్టర్ కింద పడిన క్షతగాత్రులను బయటకు తీశారు. ఆ సమయంలో ట్రాక్టర్‌పై సుమారు 15 మందికి పైగా ఉన్నారు. ట్రాక్టర్ ట్రక్కు యాకుల సత్తెమ్మ(54)పై పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో తెర్లాం మండలం గలావల్లికి చెందిన యాకుల లక్ష్మి తలకు తీవ్రగాయాలు కాగా, పెళ్లి కూతురు చెల్లి సింహాలమ్మ ముఖానికి గాయాలయ్యాయి. వీరితో పాటు మోగిలి పారయ్య, నాగళి పారమ్మ, పెంటమ్మ, పూడి సత్యం, లండ చంటి, నక్క గ్రీష్మ, సంతకవిటి మండలం సీతారాంపురానికి చెందిన ముగడ సీతారాం, పెంటమ్మలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనాల ద్వారా రాజాంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మృతురాలు సత్తెమ్మకు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ జనార్దనరావు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలిపల్లి పైడితల్లి ఆలయ పూజారి సస్పెండ్

రాజాం రూరల్: రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం పూజారి సూర్యనారాయణ శర్మను గురువారం సాయంత్రం సస్పెండ్ చేశారు. వేదం నేర్చుకునేందుకు ఆలయానికి వచ్చిన నిరుపేద బ్రాహ్మణుడు బరద్వాజ్ మౌళిని కొట్టి గాయపరిచిన విషయంపై దేవాదాయశాఖ ఆర్‌జేడీ ఎం.విజయరాజు (రాజమండ్రి) తీవ్రంగా స్పందించారు. విచారణ జరిపి వెంటనే తనకు తెలియజేయాలని దేవదాయశాఖ విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణను ఆదేశించారు. ఆర్జేడీ ఆదేశాల మేర కు ఏసీ అన్నపూర్ణ ఆలయం లో చోటుచేసుకున్న పరిణామాలను దేవ స్థానం ఈవో మాధవ రావును అడిగి తెలుసు కుని ఆర్జేడీకి వివరించా రు. చర్య లు తీసుకో వాలని ఆర్జేడీ ఏసీ అన్నపూర్ణను ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు పూజారిని ఈవో సస్పెండ్ చేశారు.







ఎస్.కోటలో ఈదురుగాలులకు పడిన చెట్లు


ఎస్.కోట రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ వైర్లపై తాటి చెట్టుపడడంతో రోడ్డుపైకి వాలిన స్తంభం

శృంగవరపుకోట ఏప్రిల్ 25: శృంగవరపుకోట పట్టణంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో తాటిచెట్లు విద్యుత్ వైర్లపై పడడంతో స్థంభం విశాఖ-అరకు రోడ్డులోకి వాలిపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండ తాత్కాలికంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఓ పక్కకు తోసారు. దీంతో పాటు స్థానిక రెల్లి వీదిలోని బొగ్గు కుమార్ కమ్మల ఇంటిపై చెట్టు పడింది. ఇంట్లో వున్న సామాగ్రి ధ్వంసమైందని బాధితులు వాపోతున్నారు. ఇక్కడ కూడ విద్యుత్ తీగలు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్‌ను ఆపేసారు. రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో పడిన విద్యుత్ స్థంబం పట్టణానికి విద్యుత్ సరఫరా చేసే లైన్ కావడంతో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాకు అటంకం కలిగింది. అయితే పడిన చెట్టు, స్థలంభంను తొలగిస్తున్నామని, కొటవీది తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ సహాయ ఇంజనీరు ఆర్.రవి కుమార్ తెలిపారు. మిగిలిన ప్రాంతాలకు అర, గంట సమయంలో విద్యుత్‌ను పునరిద్దరించేస్తామని పేర్కొన్నారు.

మలేరియాను నివారిద్దాం

విజయనగరం రింగురోడ్డు: మలేరియా నివారణ కోసం పోరాటాన్ని వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా మలేరియా నివారాణాధికారిణి వై.మణి అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అంబటిసత్తర్వు వద్ద గల ప్రెస్‌క్లబ్ జంక్షన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి శిరీష, సబ్ యూనిట్ అధికారి సురేష్, ఫైలేరియా ఇన్‌స్పెక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. ● రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ దినోత్సవ సందర్భంగా రాకోడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి ఎన్.శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **బొండపల్లి:** ప్రాణాంతక మలేరియాపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొండపల్లి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవం సందర్భంగా గొట్లాం గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ● **జామి:** మండల కేంద్రమైన జామి పిహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలను వివరించారు. ● **కొత్తవలస:** మలేరియా సమాజ రహితమే మన లక్ష్యమని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. వియ్యంపేటలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● **రాజాం రూరల్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మలేరియాను దూరం చేయవచ్చని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికా రిణి జి.భార్గవి స్పష్టం చేశారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పొగిరి గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

